# పట్టుత్తరీయం



మంగి చాపమీద పడుకుందేకాని, మనసంతా గుబులు గుబులుగా వుంది. గుడిసెలో ఓ పక్క ముసిలిది గుర్రుపెడుతోంది. చంటిది ఎప్పుడో నిద్రకు పడింది. ఎనిమిది దాటుతున్నా వీరేశు తిరిగి రాలేదు. తన పక్కన మనసిచ్చినవాడు, తాళికట్టినవాడు, ఆరడుగుల మడిసి పండుకునివుంటే తన కెంత ధైర్యం.

చిమ్మ చీకటి. తొమ్మిదైనా వీరేశు రాలేదు. మంగి పక్కనున్న ఖాళీ జాగా భయంకరంగా వుంది. పొద్దుటి నుంచి మొగుడిమీద విసుక్కుంది, కసురుకుంది. కోపంతో నెత్తురుడికి పోయేదాకా నరాలు పెట్లిపోయేటట్లు అనరాని మాటలు అంది. ఇప్పుడు చల్లబడి పోయింది. మనసంతా ఆడి మీదే!

పక్కనలేని మొగుడు నిద్రపట్టనివ్వడం లేదు. కొడవలికి కొడవలందించి తనతో గడ్డికోసేటివాడు, మంగళసూత్రం చిక్కుపడ్డదంటే సరిచేస్తూ వేళ్ళతో మెడమీద గిలిగింతలు పెట్టేవాడు, దీపాలదిన్నెమీద ఎన్నెట్లో కూర్చుంటే గులకరాళ్ళన్నీ ఏరి తనవొళ్ళో పోస్తూ, తన కళ్ళలోకి చూస్తూ ఆ రాళ్ళు లెక్కపెట్టేటివాడు, చంటిదాన్ని చేతికిస్తే ఇంత ముకం చేసుకుని దాన్ని ముద్దాడి అంత ముకంతో తన్ని ముద్దాడినవాడు .... వాడు రాలేదు. వస్తాడు.... తప్పకుండా వస్తాడు .... ఎంత పొద్దయినా వస్తాడు. ఆడికోసం గంజి పొయ్యి సెగనే వుంచింది. అడుక్కొచ్చిన ఆవకాయ బద్ద, ఉల్లిపాయ, పచ్చిమిరపకాయ భద్రం చేసింది. అయినా రాలేదు .....

దీనికంతటికీ పొద్దుటి గొడవ కారణం.

పొద్దుట పదిగంటలవేళ సుబ్బయ్య బట్టలమూట తీసికొచ్చి "చంటిదానికి నెమిలి కంటం రంగు గుడ్డవుంది కొంటావా?" అన్నాడు. ఎండలో చలి కాచుకుంటున్న ముసల్ది పరుగున వచ్చి "ఏదేది చూపించు" అంది. డబ్బుల్లేక పోతే సూడ్డమెందుకు వొద్దంది మంగి. "సూస్తే తప్పేంటే?" అని ముసల్ది ముందుకొచ్చేసరికి సుబ్బయ్య మూటవిప్పి బట్ట చూపించాడు, నెమిలికంటం రంగు మెరిసిపోతంది.

"ఎంత" అంది ముసల్ది.

"డబ్బుల్లేకుండా బేరం కూడానా?" విసుక్కుంది మంగి.

మంగి మాట వినకుండా ఇద్దరూ బేరమాడుతున్నారు.

'ఆరు'

'అబ్బే రెండు'

'మంచి బేరమే! ఐదు'

'అయితే అక్కర్ల. రెండున్నర'

'గిట్టదు.పోన్లే పిల్లదానికి మూడు చేసుకో' అంటూ పిల్లదానిమీద గుడ్డ గిరవాటేశాడు.

నిజం చెప్పొద్దూ! ఆగుడ్డలో పిల్ల మెరిసిపోయింది. మంగి సంబరపడింది.

లోపలకెళ్ళి ముంతలో దాచిన చిల్లర వెతికితే రెండు ముప్పావలయింది.

'అత్తా! పావల్తక్కువయింది' అని మంగి అరిస్తే "నువ్వు నాకిచ్చిన పావల ఆ మూలన పాతిపెట్టినా" అంటూ ముసల్ది లోపలికెళ్ళింది.

ఇంతలో వీరేశు వచ్చాడు. సుబ్బయ్య వీరేశుని చూసి "ఓరయ్యా నీకు మిరప్పళ్ళ పట్టుత్తరీయం ఉందిరా! ఆదేస్తే నువ్వు దొరబాబులా ఉంటావు." అనటమేమిటి ఉత్తరీయం తీసి వాడిక్కట్టడమేవిటి క్షణంలో జరిగిపోయింది. వీరేశు మెరిసిపోయే ఉత్తరీయం సరిచేసుకుంటూ, మీసం మెలేశాడు. 'డబ్బుల్లేవే' అంటూనే 'ఎంత?' అనడిగాడు. 'నీగ్గాబట్టి పది'అన్నాడు సుబ్బయ్య, 'అబ్బే నాలుగు..... ' ఇలా బేరం ఆడీ ఆడీ ఆరుకి ఫైసలయింది.

ఇంతలో మూడు రూపాయల్తో మంగి వాకిట్లో కొచ్చింది. వీరేశు ఆ మూడు చటుక్కున లాక్కుని

"నువ్వుపుట్టింటి కాడనించి తెచ్చిన మూడు ఇయ్యే! ఈ పట్టుకండువా కొనుక్కుంటా" అన్నాడు.

"ఓరి నీ అది పిల్లదాని గుడ్డకిరా ...... నువ్వేం జేసినా సరే నా పుట్టింట సొమ్మియ్యను" అరిచింది మంగి.

"నేన్నీ మొగుణ్ణే! నాకు మూడురూపాయలియ్యవంటే ..... సూస్తానే ఎట్టియ్యవో

.... " అంటూ రయ్యన లోపలికి పరుగెత్తి ముంత ధడేల్న పగల కొట్టాడు. "ఓర్నాయనో!" అని శోకాలుపెడ్తున్న మంగిని పక్కకు తోసేసి సుబ్బయ్య చేతిలో డబ్బు పోశాడు. డబ్బు, నెమలికంఠం గుడ్డతో మూట కూడా సొంతం కట్టుకోకుండా పారిపోయాడు సుబ్బయ్య.

గుడిశెలో నిశ్శబ్దం. ముసల్ది గుడ్ల నీరు గుడ్ల కుక్కుకుంది. మౌనంగా గంజి యిచ్చింది మంగి. వీరేశు తాగి మూతి తుడుచుకుని తలకి నూనె రాసుకు దువ్వుకుని చలవ పంచెకట్టుకుని పట్టుత్తరీయం మీదేసుకుని వాకిట్లో కొచ్చాడు. పెళ్ళాం 'కండువా బాగుంది' అంటుందేమో అనుకున్నాడు. అనలేదు. తనే అడిగాడు "కండువా బాగుంది కదే?" మంగి మాట్లాడలేదు. వెళ్ళిపోయాడు. రాత్రయినా తిరిగి రాలేదు.

పదయింది. పన్నెండయ్యింది. వీరేశు రాలేదు. గంజి చల్లారింది. పొయ్యారి పోయింది. రాలేదు. తెల్లవారు జాము తడిక తోసుకు వస్తాడనుకుంది. రాలేదు.తెల్లారి తను బయటకెళ్ళేసరికి పలుదోముకుంటూ బయట వుంటాడనుకుంది - తెల్లవారి చూస్తే బయట లేడు. కళ్ళ నీళ్ళయిపోతోంది మంగి. కన్పిస్తే కాళ్ళమీద పడదామనుకుంది. వీరేశు రాలేదు.

తొమ్మిదయింది. చల్లారిన గంజి ముసలిదానికిచ్చి మళ్ళీ గంజి పొయ్యిమీద పెట్టింది. తానమాడీ దొడ్లోంచి వస్తోంటే గుడిశెముందు వీరేశు మాటలు విన్పించాయి. గుండె పొర్లింది మంగికి. వెళ్ళి కావలించుకుందామనుకుంది. ఇంతలో తిరిగి కోపం తెర్లింది. వెళ్ళలేదు.

తేరిచూస్తే తన పట్టు కండువా చింపించి పిల్లకి రెండు గౌనులు కుట్టించి ఒక గౌను దానికి తొడిగి రెండోది దాని తలకి చుట్టి అది నవ్వుతుంటే తను కేరింతలు కొడుతున్నాడు. మంగి పొంగిపోయింది. మాట్లాడకుండా వేడి వేడి గంజి, ఆవకాయ బద్ద, ఉల్లిపాయ, పచ్చిమిరపకాయ వీరేశు ముందు పెట్టింది.*